# కనకమాలక్ష్మి

-దానం ఉమాదేవి

"ఎంతసేపు మడతత పెడతావా చీరను?" విసుక్కుంటూ గదిలోకి వచ్చింది రాజేశ్వరి.

"చీర మెరిసిపోతోందమ్మా" తన్మయత్వంగా చీరను తడుముతూ చెప్పింది మాలక్ష్మి.

"కుందన్ బీడ్స్‌తో ఆ వర్క్ చేయించడానికే మూడువేలైంది తెలుసా?"

"మూడువేలే?"గుండె మీద చెయ్యేసుకుంది మాలక్ష్మి.

"తీరిగ్గా ఆశ్చర్యపోదువుగానీ... అల్లుడుగారు వచ్చే టైమైంది. ముందా రూమ్ శుభ్రం చేసిరా" రాజేశ్వరి కోప్పడటంతో చీరని మడతేసి గది శుభ్రం చేయడంలో మునిగిపోయింది మాలక్ష్మి.

మాలక్ష్మి పూర్తి పేరు కనకమాలక్ష్మి. పాతికేళ్లుంటాయి. పదమూడేళ్లకే పెళ్లయింది. పదిహేనేళ్లు నిండేటప్పటికి ఓ బిడ్డకు తల్లయింది. రెండోసారీ ఆడపిల్లే పుట్టినప్పుడు అత్తింటివాళ్లు చాలా గొడవ చేసారు. ఆడపిల్లలు పుట్టడానికి తనే కారణమని తిట్టిపోసారు. భర్త చేయి చేసుకోవడమేకాక పుట్టింటికి కూడా పంపించాడు.

వ్యవసాయ కూలీలుగా బ్రతుకు వెళ్లదీస్తున్న మాలక్ష్మి తల్లిదండ్రులకు కూతుర్ని, ఇద్దరు మనవరాళ్లను సాకడం తలకు మించిన భారంగా తోచింది. పెద్దమనుషుల ఎదుట పంచాయితీ పెట్టించి అల్లుడికి నచ్చచెప్పి కూతుర్ని అత్తవారింటికి పంపించారు. అత్తవారింట్లో జీవితం మరీ నరకమనిపించింది మాలక్ష్మికి. అత్తమామల సూటిపోటి మాటలతోపాటు ఆటోడ్రైవర్‌గా పని చేసే భర్త రాత్రయ్యేసరికి చిత్తుగా తాగొచ్చి మాలక్ష్మి ఒళ్ళు హూనం అయ్యేలా కొట్టేవాడు. వాడు ఇంట్లో వున్నంతసేపు పిల్లలు ఏడ్చినా ఆడపిల్లలను కన్నందుకు మాలక్ష్మికి తన్నులు తప్పేవికావు. కలహాల కాపురంలోనే మూడోసారి గర్భం దాల్చింది.

గర్భం దాల్చిన విషయం తెలిసిన దగ్గర్నుండి మాలక్ష్మికి బెదిరింపులు మొదలయ్యాయి. నెలలు నిండేకొద్దీ బెదిరింపులు ఎక్కువయ్యాయి.

'ఆడపిల్లను కన్నావో ఛస్తావు''

'ఈసారి మగపిల్లవాడిని కనకపోతే నీ పని చెబుతాం'

'మళ్లీ ఆడపిల్ల పుడితే మీ అందరినీ విషం పెట్టి చంపేస్తా'

అత్త, భర్త బెదిరింపులు ఎక్కువయ్యేకొద్దీ మాలక్ష్మికి ఏంచేయాలో పాలుపోయేదికాదు. 'దేవుడా! మగపిల్లవాడే పుట్టేలా చేయి' రోజూ భగవంతుడ్ని ప్రార్థించేది.

ఆమె ప్రార్థన భగవంతుడికి చేరలేదేమో! మళ్లీ ఆడపిల్లే. మాలక్ష్మిలో భయం. విషంపెట్టి తనను, ముగ్గురు పిల్లలను చంపేస్తారా?

తన కోడలు దరిద్రపుగొట్టుదని, మూడు సార్లు అవకాశమిచ్చినా మగపిల్లవాడిని కనలేకపోయిందనీ తిట్టిపోసి పుట్టింటికి పంపించివేసారు.

ఇరవై ఏళ్లు నిండేటప్పటికి ముగ్గురు ఆడపిల్లలు. పైగా మొగుడు వదిలేసాడన్న పేరు ఒకటి.

నాలుగు నెలలు తన దగ్గరుంచుకున్న తరువాత ఆమెను మళ్లీ అత్తవారింటికి పంపే ప్రయత్నాలు మొదలుపెట్టారు మాలక్ష్మి తల్లిదండ్రులు. మాలక్ష్మి అత్తగారు అస్సలు ఒప్పుకోలేదు. తన కొడుక్కి రెండో పెళ్లి చేయాల్సిందేనని పట్టుబట్టింది. అల్లుడికి రెండో పెళ్లి చేయడానికి తమకేమీ అభ్యంతరం లేదని, కానీ తమ కూతుర్ని కూడా అత్తారింట్లోనే వుంచుకోవాలని బ్రతిమిలాడాడు మాలక్ష్మి తండ్రి రంగడు. అయిష్టంగానే ఒప్పుకున్నది మాలక్ష్మి అత్తగారు.

కానీ మాలక్ష్మి ఒప్పుకోలేదు. భర్త మళ్లీ పెళ్లి చేసుకుంటే తన స్థానం ఏమిటి? మళ్లీ ఆడపిల్ల పుడితే కథ మొదటికేగా? మగపిల్లవాడు పుట్టే దాకా తన్నులు తినాల్సిందేనా? డాక్టర్లు పుట్టేది ఆడో మగో చెబితే, ఆడ అయితే గర్భం తీయించుకోవచ్చు. కానీ అలా చెప్పడం నేరం అని వాళ్లు చెప్పడంలేదు.

అందుకే తల్లిదండ్రులతో గట్టిగా చెప్పింది తాను అత్తవారింటికి వెళ్లనని.

తల్లిదండ్రులు నయానా భయానా చెప్పి చూసారు. మాలక్ష్మి మెత్తబడలేదు. నాలుగిళ్లల్లో పాచిపని చేసి తన పిల్లలను పోషించుకుంటానని చెప్పింది.

అత్తారింటికి పోనని మొండికేయడంతో కొన్నాళ్లు ఇరుగు పొరుగు నోళ్లలో నానింది. మాలక్ష్మికి పొగరెక్కువని, ఎవరో ఉన్నారని, అందుకే మొగుడు వదిలేసాడని రకరకాల విమర్శలు. మళ్లీ నరకంలోకి వెళ్లడంకంటే ఈ విమర్శలు భరించడమే నయమనిపించింది మాలక్ష్మికి.

పాచి పనులు చేసుకుంటూ చిన్న గుడిసె అద్దెకు తీసుకుని తన పిల్లలను పోషించుకోవడం మొదలుపెట్టింది.

***

"మాలక్ష్మీ! రేపు మా మనవరాలి బారసాల. పెందలాడే రా'' పని చేసి ఇంటికి వెళుతున్న మాలక్ష్మితో చెప్పింది విజయ.

ఆ కాలనీలోనే పది ఇళ్లల్లో చేస్తోంది మాలక్ష్మి. పిల్లలు ముగ్గుర్ని సర్కారు బడికి పంపి

స్తున్నది. వాళ్లకు మధ్యాహ్న భోజనం అక్కడే. తన యజమానులు ఎవరు ఏది పెట్టినా దాచి సాయంత్రం పిల్లలు వచ్చాక వాళ్లకే పెడుతుంది.

అందర్నీ పిలిచి గొప్పగా బారసాల జరుపుకుంటున్న విజయ కూతురును అల్లుడిని చూస్తే ఏ మూలో బాధ. విజయ కూతురు స్వర్ణకు రెండో సారీ ఆడపిల్లే పుట్టింది. కానీ ఆమె భర్త ఏమీ అనలేదు. సంతోషంగానే ఉన్నాడు. కానీ తననెందుకు తన భర్త కొట్టాడు?

తన వయసున్న విమలమ్మ కూతురికి ఇంకా పెళ్లి చేయలేదు. తన పెద్ద కూతురుకు అప్పుడే పదేళ్లు. ఇంకో రెండేళ్లకు దానికి పెళ్లి చేస్తే తనకు ముప్పై రాకుండానే అమ్మమ్మ అవుతుంది. తన గతి తన కూతురుకు పట్టకూడదు. సర్కారు బళ్లో అవకాశమున్నంతవరకూ చదవించాలి... మనసులో గట్టిగా అనుకుంది మాలక్ష్మి.

బారసాలకు వచ్చినవాళ్లందర్నీ పరీక్షగా చూసింది. అందరి వంటిమీదా జిగేలుమనే చీరలే. ఒక్కసారన్నా అలాంటి చీర కట్టుకుంటే బాగుండు. తన పెళ్లప్పుడు మూడు కొత్త చీరలు కొన్నారు. అంతే... ఆ తరువాత వరుసగా ఆడపిల్లలు పుట్టడం, చీదరింపులు.ఛీత్కారాలతోనే గడిచింది జీవితం. ఇప్పుడు ముగ్గురు పిల్లల బాధ్యత తనదే కావడంతో పనులు చేస్తూ వస్తోంది. తాము తినడానికి పిల్లలకు అవసరమైనది కొనడానికే సరిపోతుంది. ఒక్కసారన్నా మెరిసే చీర కొనాలన్న కోరిక ఎక్కువైంది మాలక్ష్మిలో.

★★★

మరుసటిరోజు రాజేశ్వరమ్మ ఇంటికి పనికి వెళ్లినప్పుడు ఆమెను అడిగింది.

"ఇలాంటి చీరలు తక్కువలో అమ్మరాండీ?"

"చమ్కీ చీరలైతే కొంచెం తక్కువ ఉంటాయి"

"ఎవరికి చీరలు?" అంటూ వచ్చింది రాజేశ్వరి కూతురు శ్వేత.

"నిన్న నీ చీర చూసిన దగ్గర్నుంచీ దాని మనసు దానిమీద పడింది" నవ్వుతూ చెప్పింది రాజేశ్వరి. శ్వేత, ఆమె భర్త ఇద్దరూ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. ఉగాదికి తల్లిగారింటికి వచ్చింది.

"నీ పేరేమిటి?"

"కనకమాలచ్చిమి" శ్వేత ప్రశ్నకు బదులిచ్చింది మాలక్ష్మి.

"మరి కనకం ఎక్కడ?" అన్నది దాని మెడ చూస్తూ నవ్వుతూ. మాలక్ష్మి చరిత్ర మొత్తం తల్లి చెప్పడంతో ఆమె వైపు జాలిగా చూసింది.



"పుట్టేది ఆడా మగా అనేది నిర్ణయించేది స్త్రీ కాదు. స్త్రీలో ఎక్స్ క్రోమోజోములు మాత్రమే ఉంటాయి. పురుషుడిలో ఎక్స్, వై క్రోమోజోములు ఉంటాయి. పురుషుడిలోని ఎక్స్ క్రోమోజోమ్, స్త్రీలోని ఎక్స్ క్రోమోజోమ్ కలిస్తే ఆడబిడ్డ, స్త్రీలోని ఎక్స్ క్రోమోజోమ్, పురుషుడిలోని వై క్రోమోజోమ్ కలిస్తే మగబిడ్డ పుడతాడు. ఆడా మగా పుట్టుకకు కారణం మగవాడే" చెప్పింది శ్వేత. ఆమె చెప్పినదంతా అర్థం కాకపోయినా ఒక్క విషయం మాత్రం అర్థమైంది మాలక్ష్మికి. తనకు ఆడపిల్లలు పుట్టడానికి కారణం తాను కాదు, తన భర్తే. ఈసారి ఎవరైనా తన భర్త గురించి అడిగితే వరుసగా ఆడ పిల్లలు పుట్టడానికి కారణమైనందుకు తానే వాడ్ని వదిలేసిందని చెప్పాలి అనుకున్నది కసిగా.

***

రేపు ఉగాది. ఎప్పుడూ కొత్త బట్టలు పిల్లలకే కొంటున్నది. ఏమైనా ఈసారి తాను చీర కొనుక్కోవాలని నిశ్చయించుకుంది మాలక్ష్మి.

తాను పాచి పని చేసే భవానీ శంకరంగారి బట్టలకొట్టుకెళ్ళింది.

ఏమిటన్నట్లు చూసాడు భవానీశంకరం.

"చీర..." నసిగింది మాలక్ష్మి.

"ఇక్కడ పాత చీరలు ఎందుకుంటాయి. అమ్మగారినడిగి ఈసారి తీసుకుందువులే వెళ్లు."

"కొత్త చీర కొనుక్కుంటానయ్యా. మీరు ఇచ్చే జీతంలో నెలకు కొంచెం తగ్గించి ఇవ్వండి."

"నీకూ కొత్త చీర కావాల్సి వచ్చిందా?" నవ్వుతూ మాలక్ష్మికి చీరలు చూపెట్టమని గుమస్తాకు చెప్పాడు భవానీశంకరం.

గుమాస్తా చూపించిన మామూలు సిల్కు చీరలు నచ్చలేదు మాలక్ష్మికి.

"మెరిసే చీరలు చూపించు"

"నీకు కూడా వర్క్ చీరలు కావాలా? అవి ఖరీదుంటాయి"

"వాటిలో తక్కువతో ఉన్న చీరలు చూపించు" బ్రతిమాలుతూ అడిగింది. గుమాస్తా చూపించిన చీరల్లోంచి మబ్బుకలర్ చీరమీద అక్కడక్కడ చమ్కీవర్క్ చేసిన చీర సెలెక్ట్ చేసుకుంది.

"ఐదొందలు" గుమస్తా చెప్పిన రేటు వినగానే గుండె గుభేలుమంది.

"సారూ... రేటు తగ్గిస్తే" నసుగుతూ భవానీ శంకరంవైపు చూసింది మాలక్ష్మి.

"ఈ చీరలు రేటుంటాయి మాలక్ష్మి. మూడొందల యాభై చివరి మాట. నీవు నా దగ్గర పని చేస్తున్నావు కాబట్టి"

గంటసేపు బేరమాడి మూడువందలకు కొనుక్కున్నది. అంతకుమించి పైసా కూడా తగ్గించనన్నాడు భవానీ శంకరం. అతడిచ్చే జీతంలో నుండి నెలకు యాభై రూపాయలు తగ్గించుకునే షరతుమీద ఒప్పందం కుదిరింది.

"నీ బాకీ తీరేటప్పటికి ఆర్నెల్లు పడుతుంది. పైగా చాలా రేటు తగ్గించాను" విసుగ్గా అన్నాడు భవానీశంకరం.

"మీ ఇంటికి చుట్టాలొచ్చినా, పని ఎక్కువైనా నాకు అదనంగా డబ్బు ఇయ్యవద్దులే సారూ" బ్రతిమాలింది మాలక్ష్మి.

తాను తగ్గించిన రేటుకి రెండింతలు పని చేయించుకోవడం ఎలానో భవానీ శంకరంకు తెలుసు.

"సరేలే.. అంటూ చీర కవరులో పెట్టి మాలక్ష్మి చేతికి అందిచ్చాడు.

మాలక్ష్మి మొహం సంతోషంతో వెలిగిపోయింది.

***

ఉగాదినాడు ఉదయం అందరిళ్ళల్లో పనులు చేసి సాయంకాలం ఎవరింటికీ రానని చెప్పింది. కారణం అడిగినవాళ్లకు కొత్త చీర కట్టుకోవాలని చెప్పింది.


"నీ కొత్త చీర మురిపెం కాదుగానీ పండుగరోజు పని ఎగ్గొడుతున్నావు" విసుక్కున్నది రాజేశ్వరి.

"పోనీలేవే. చిన్న వయస్సు కదా. ఏదో ముచ్చటపడుతున్నది" కోడలికి సర్దిచెప్పింది రాజేశ్వరి అత్తగారు ఎనభయ్యేళ్ల సీతమ్మ.

సీతమ్మకు మొదటినుండీ మాలక్ష్మి అంటే జాలి.

"సాయంత్రం వచ్చి అన్నం పెట్టించుకుని వెళ్లు"వెళుతున్న మాలక్ష్మికి వినబడేటట్లు చెప్పింది సీతమ్మ.


సాయంత్రం ఐదింటికే తలస్నానం చేసి తాను కొనుక్కున్న చీర కట్టుకుంది మాలక్ష్మి. పిల్లలు చమ్కీలు అంటూ చీరను పట్టుకోబోతే ఊరుకోలేదు.



## నీళ్ళక్కర్లేని మొక్క

ఇజ్రాయిల్‌లోని నెగీవ్ ఎడారిలో నీళ్ళక్కర్లేని మొక్కనొకదాన్ని ఇటీవల సైంటిస్టులు కనుగొన్నారు. తన తోటి మొక్కలకన్నా 16 రెట్ల తేమని తనలో నిల్వ చేసుకోగల ఈ మొక్క తనకవసరమైనప్పుడు తన నిల్వల నుంచి దాహం తీర్చుకుంటుందిట! ప్రపంచంలో ఎప్పటికీ నీళ్ళక్కర్లేని మొక్క ఇదొక్కటేనట!

-తటవర్తి



"చమ్కీలు ఊడిపోతాయి" అంటూ కసురుకుంది. పిల్లలు ముగ్గురూ ఉతికిన బట్టలు కట్టుకున్నారు. పెద్ద టిఫిన్ తీసుకుని పిల్లలతో తాను పని చేసే ఇళ్లకు బయలుదేరింది.

అందరిళ్లల్లో అన్నం పెట్టించుకున్నది. ప్రతి ఒక్కరినీ తన చీర బాగుందా? అని అడిగింది. విజయమ్మ వాళ్లింట్లో బెడ్రూంలో వుంటుంది పెద్ద అద్దం. తనను ఆ గది శుభ్రం చేసేటప్పుడు తప్ప వెళ్లనీయరు. రాజేశ్వరమ్మ ఇంట్లో హాల్లో ఉన్న అల్మారా తలుపుకు అద్దం బిగించి ఉంది. అందులో చూసుకోవాలి అనుకుంది. రాజేశ్వరమ్మ ఇంట్లో అడుగుపెట్టగానే అద్దంలో తనను తాను చూసుకుని మురిసిపోయింది.

"చూసుకున్నది చాలుగానీ ఆ రెండు గిన్నెలు కడిగేసి వెళ్లు" గారెలు, పూర్ణాలు మాలక్ష్మి కూతుళ్ల చేతుల్లో పెడుతూ చెప్పింది రాజేశ్వరి.

"మసి చిందులు పడి నా చీర పాడైపోతుందమ్మా. రేపు కడుగుతా" అంటూ పిల్లలతో బయటకు నడిచింది మాలక్ష్మి.

నాలుగడుగులు వేసిందో లేదో పసిబిడ్డ ఏడుపు వినిపించడంతో చుట్టూ చూసింది. ఎవరూ కనిపించలేదు. అంతలోనే మళ్లీ ఏడుపు. ఆ దారిన వెళుతున్న నలుగురైదుగురు కూడా ఆ ఏడుపు విని ఆగారు. ఆ కాలనీలోని మురుగునీరంతా అటు ప్రవహిస్తుంది. అన్నిళ్లల్లోని చెత్త కూడా అక్కడికే చేరుకుంటుంది. ఆ ఖాళీ ప్రదేశమంతా ముళ్లచెట్లతో నిండి వుంది.

పసిబిడ్డ గుక్క తిప్పుకోకుండా ఏడుస్తున్నట్లు వినరావడంతో చుట్టుపక్కల నాలుగిళ్లల్లోనివారు బయటకువచ్చారు. మగవాళ్లు బయటకు వెళ్లినట్టున్నారు. ఒకరిద్దరు తప్ప అందరూ ఆడవాళ్లే.

"అక్రమ సంతానాన్ని వదిలేసారెవరో" అన్నది విజయ.

"ఆడపిల్లని విసిరేసారేమో?" రాజేశ్వరి సందేహం.

"ప్రాణాలు పోకముందే ఆ బిడ్డ ఎక్కడుందో చూసి పైకి తీయండి" అప్పుడే వచ్చిన రాజేశ్వరి అత్తగారు సీతమ్మ చెప్పింది కర్ర ఆసరాతో నిలబడుతూ.

అందరూ ఆ తుప్పలవైపు పరిశీలనగా చూసిన తరువాత కన్పించింది పసిబిడ్డ. ముళ్లకంపల మధ్య, దుర్గంధం మధ్య పడివుంది ఆ పసిబిడ్డ.

"నూట ఎనిమిదికి ఫోన్ చేద్దాం" అన్నారొకరు.

ఈలోగా కుక్క ఒకటి ఆ పసిబిడ్డవైపు వచ్చి చుట్టూ తిరగడం మొదలుపెట్టింది. "ఛ్..ఛ్.." అరుస్తున్నారు దూరంగా మూగిన జనం. కుక్కను అదిలిస్తున్నారు. అది ఏమాత్రం అక్కడనుండి కదలడంలేదు.

"పదినిముషాల్లో అంబులెన్స్ వస్తుంది" అన్నారెవరో.

ముళ్లచెట్టు కొమ్మలు గాలికి కదిలి ఆ పసిబిడ్డకు గుచ్చుకుంటున్నాయేమో ఏడుపు ఆపడంలేదు ఆ బిడ్డ.

అంబులెన్స్ వచ్చేటప్పటికి ఏడ్చీ ఏడ్చీ ఆ పసిపాప గొంతెండిపోతే? ఆ కుక్క ఆ బిడ్డను చీల్చి చంపితే?

మాలక్ష్మి మనస్సు ఆగడంలేదు. తన చేయి పట్టుకున్న చిన్న కూతురిని వదిలించుకుని చిన్నగా బురదలోకి దిగి పసిబిడ్డను సమీపించి అక్కడున్న కుక్కను అదిలించింది. జాగ్రత్తగా పసిబిడ్డను బయటకు తీసి గుండెలకు హత్తుకుంది. పుట్టిన వెంటనే విసిరేసిపోయినట్టున్నారు. ఆ వంటిమీద రక్తం చారికలు అలాగే ఉన్నాయి. ముళ్లు గీసుకున్న భాగాల నుండి కొద్దిగా రక్తం కారుతోంది. ఆ పసిబిడ్డను అలాగే గుండెలకు హత్తుకుని ఇవతలకు వచ్చింది మాలక్ష్మి. ఆడపిల్ల. మాలక్ష్మి కొత్త చీరంతా రక్తం మరకలు. ఆ పసిబిడ్డతోసహా ఇంటికి వెళ్లడానికి ముందుకు అడుగులేసింది మాలక్ష్మి.

"అంబులెన్స్ కాసేపట్లో వస్తుంది. ఎక్కడికి వెళుతున్నావు?" అడిగిందొకామె.

"నేనే పెంచుకుంటానమ్మా"

అందరిలో ఆశ్చర్యం. ముగ్గురు ఆడపిల్లలను ఎలా పెంచాలా అని ఎప్పుడూ బాధపడుతుంది. మళ్లీ మరో ఆడపిల్లా?

"మళ్లీ ఆడపిల్ల అని నా మొగుడు ఇప్పుడు కొత్తగా వదిలేయడు. ముగ్గురు ఆడపిల్లలున్నారు. నాలుగోది బరువుకాదు. నిండా మునిగాక చలి ఏమిటి? నాకున్నదే పెడతాను. తల్లి విసిరేసిపోయినా ప్రాణాలు పోలేదు. అంటే భూమ్మీద నూకలున్నాయన్నమాట. వదిలేయానికి మనసొప్పడం లేదు నాకు."

మాలక్ష్మి చెప్పిన మాటలు విని అందరూ ఆమె వెళుతున్న వైపే చూస్తున్నారు. వేల ఖరీదు పెట్టి కొనుక్కుని వాళ్లు కట్టుకున్న జిలుగువెలుగు చీరలు మాలక్ష్మి బురద చీర ముందు కాంతి విహీనంగా కనబడుతున్నాయి. బురద చీరతో, బోసి మెడతో వెళుతున్న మాలక్ష్మి సాక్షాత్తూ కనక మహాలక్ష్మిలా, సర్వాలంకార భూషితలా కన్పించింది రాజేశ్వరి అత్తగారికి.

★



## ఇబ్బంది పడుతున్న త్రిష!

అక్షయ్ కుమార్ సరసన నటిస్తూ బాలీవుడ్‌లోకి కూడా అడుగుపెడుతున్న త్రిష త్వరలో సింహళ భాషా చిత్రంలోనూ నటించబోతోందిట. తెలుగు, తమిళంతో పాటు హిందీలో 'ఖట్టామీటా'... ఇలా ఒక్కో భాషలో ఒక్కో సినిమా చేస్తోన్న త్రిష శ్రీలంక చిత్రంలోనూ నటించడానికి అంగీకరించిందని చెన్నయ్ సమాచారం. ఆల్రెడీ ఈ సినిమా షూటింగ్ కొలంబోలో జరుగుతోందిట. అయితే ఇలా వివిధ భాషల్లో ఒకేసారి నటిస్తుండడం వల్ల కాల్షీట్లని ఎడ్జస్ట్ చేయడం తెగ ఇబ్బందిగా వుందంటోందిట.

